క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అదాలత్ కూడలి, కోర్టు వెనుక వైపు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్దాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పథక పనులను డీఆర్డీఓ మేన శ్రీను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఎన్ని గంటల పాటు పనిచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం పశువుల షెడ్, నర్సరీలను పరిశీలించారు. ఎంపీడీఓ కర్ణాకర్ రెడ్డి, ఏపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఈసీ రామచంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత, సరిత పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ స్వగృహంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీని అందించారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ గౌరవాధ్యక్షుడు వాలు నాయక్, కార్యదర్శి అజ్మీర శ్రీరాం నాయక్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రవి నాయక్, నాయకులు తారాచంద్, జవహర్ నాయక్, రాజశేఖర్ నాయక్, శశినాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



హన్మకొండ: బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలైన సంచార జాతుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హనుమకొండలో శనివారం విడుదల చేసి ఆయన మాట్లాడారు. బీసీల సంక్షేమానికి బీసీ కార్పొరేషన్, ఎంబీసీల సంక్షేమానికి ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లుగా సంచార జాతుల సంక్షేమానికి కూడా సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయిస్తున్నా ఆ నిధుల్లో సంచార జాతులకు ఒక్క పైసా కూడా చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమూ సంచార జాతుల పక్షాన సబబైన నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రమేష్, వినయ్ చారి, శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలని ధర్నా



విద్యారణ్యపురి: ఖమ్మంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన విద్యార్థి యోగానందిని ఆత్మహత్యకు కారణమైన యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలో అదే విద్యాసంస్థకు చెందిన స్కూల్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు మర్రి మహేష్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో నాయకులు పవన్, వినయ్, రాజేష్, సంతోష్, గణేష్, అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలుకు ఉప్పల్‌లో హాల్టింగ్ ఇప్పించండి

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో కరీంనగర్ – తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇప్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని తన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు.

ప్రతిపాదనలకే పరిమితం

- కాజీపేటలో గ్రంథాలయ స్థలం కేటాయింపులో జాప్యం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠకులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



కాజీపేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం



కాజీపేటలో గ్రంథాలయం కోసం ప్రతిపాదించిన స్థలం

కాజీపేట: కాజీపేట పట్టణంలో గ్రంథాలయ భవన నిర్మాణ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం కావడంతో పాఠకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తితో మూడు దశాబ్దాల క్రితం కాజీపేటలో ఏర్పాటైన గ్రంథాలయం నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. సరైన స్థలం లేకపోవడంతో సర్కిల్ కార్యాలయం ఆవరణలోని రెండు షాపింగ్ కాంప్లెక్స్ గదులను అద్దెకు తీసుకొని అతి కష్టం మీద కార్యకలాపాలను సాగిస్తున్నారు. జిల్లా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలకు సమానంగా విలువైన ఎన్నో గ్రంథాలు ఉన్నప్పటికీ సరైన వసతి సౌకర్యం కొరవడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనం నిర్మించడానికి చర్యలు చేపట్టాలంటూ పాఠకుల పలు విన్నపాలకు స్పందించి స్థల సేకరణకు గతంలో అధికారులు ఆదేశాలు జారీచేసినా ఫలితం లేకుండా పోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విలువైన ఫర్నిచర్, విలువైన గ్రంథాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు చాలానే ఉన్నా గదులు సరిపోక, ఎక్కడ పెట్టాలో తెలియక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వంద మందికి పైగా పాఠకులు గ్రంథాలయానికి వచ్చిపోతుంటారు. అయితే పట్టుమని పదిమంది పాఠకులు కూర్చునే స్థలం కూడా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నిలబడి పత్రికలు, పుస్తకాలు చూసి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

స్థలం కేటాయించాల్సిందే..



ప్రజాప్రతినిధులు స్పందించి కాజీపేట చౌరస్తా సమీపంలో ఉన్న పాత మున్సిపల్ భవన స్థలాన్ని గ్రంథాలయ శాఖకు కేటాయించేలా చర్యలు చేపట్టాలి. గత చైర్మన్ మంజూరు చేసిన నిధులతో చక్కటి భవనాన్ని నిర్మించుకోవచ్చు. స్థలం కేటాయించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

- పిల్లల కుమారస్వామి, కాజీపేట

ఇరుకు గదులతో నిత్యం బాధలే..



ఎన్నో విలువైన పుస్తక సంపద అందుబాటులో ఉన్నా వినియోగించుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. రెండు గదుల్లో ఒకటి పత్రిక పఠనానికి, ఇంకొకటి పుస్తకాలను నిల్వచేయడానికి ఉపయోగిస్తున్నారు. దాంతో స్థలం కరువై పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

- బొడ్డు కృష్ణ, కాజీపేట

ప్రత్యామ్నాయంపై దృష్టి

కాజీపేట చౌరస్తాకు కూతవేటు దూరంలో ఉన్న పాత మున్సిపల్ భవనం స్థలాన్ని గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి కేటాయించాలన్న ప్రతిపాదనలు సీఎం కార్యాలయంలో పదేళ్లుగా కునుకు తీస్తున్నాయి. కాజీపేటలో గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయిస్తే రూ.50 లక్షలను తక్షణమే మంజూరు చేసి సకల సౌకర్యాలతో నూతన భవనం కట్టిస్తానంటూ గతంలో అనేక సమావేశాల్లో గ్రంథాలయ చైర్మన్లు హామీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అధికారులు స్థలం కేటాయించాలని కాజీపేట పట్టణవాసులు కోరుతున్నారు.

ఎంపీ కావ్యకు ఆహ్వానం



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్యను అర్చకులు ఆహ్వానించారు. ఈమేరకు ఆమెను దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈఓ అనిల్‌కుమార్ శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ పురావస్తుశాఖ ఆధీనంలో ఉన్న వేయిస్తంభాల దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కావ్య మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నిధులు వచ్చేలా కృషి చేస్తానని, పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తానని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం ఐనవోలు మండలం గర్మిల్లపల్లి గ్రామానికి చెందిన ఎండీ.జహంగీర్ పాషా (29) వ్యక్తిగత పనిమీద ఈనెల 20న బైక్‌పై వరంగల్ వెళ్తున్న క్రమంలో ఫోర్ట్‌రోడ్డుపై గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో జహంగీర్‌కు తీవ్రగాయాలు కాగా, స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచాడు. మృతుడి తండ్రి ఎండీ.అమీర్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

కుటుంబ బంధాలను దృఢపర్చుకోవాలి

- జిల్లా సంక్షేమాధికారి రాజమణి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఖిలా వరంగల్: బంధువులు, మిత్రులు, కుటుంబ సభ్యులతో బంధాలు, బంధుత్వాలను విద్యార్థులు దృఢపర్చుకోవాలని వరంగల్ జిల్లా సంక్షేమాధికారి రాజమణి సూచించారు. మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శైలేంద్రకుమార్, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థి దశలో అమ్మమ్మ, తాతయ్య, నానామ్మ, బాబాయి తదితర బంధువులతో ఎలా వ్యవహరించాలో నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు శోభారాణి, వెంకటరమణ, భాస్కర్, కిరణ్‌కుమార్, యాకుబ్‌పాషా, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

ఆర్ఏఎస్‌సీఐ సౌత్ రీజనల్ హెడ్ చందా వడ్డె



విద్యారణ్యపురి: విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఎస్‌సీఐ) హెడ్ చందా వడ్డె సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చందా వడ్డె మాట్లాడుతూ రిటైల్‌లో బీబీఏ విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, అధ్యాపకులు రాజు, రాజిరెడ్డి, సుమలత, మమత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకు శిక్షణ దోహదం



జెన్‌పాక్ట్ ప్రతినిధికి మెమొంటో అందజేస్తున్న రజనీలత, అధ్యాపకులు

విద్యారణ్యపురి: జెన్‌పాక్ట్ కంపెనీ ద్వారా ఫైనాన్స్ అకౌంటింగ్‌పై బీకామ్, బీబీఏ విద్యార్థులకు రెండు వారాలపాటు నిర్వహించిన శిక్షణ వారి నైపుణ్యాల పెంపునకు ఎంతో దోహద పడుతుందని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. ఈనెల 10న కళాశాలలో ప్రారంభమైన శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెన్‌ప్యాక్ట్ ప్రతినిధి మంజుల మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రజనీలత, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శివనాగ శ్రీనివాస్, మెంటార్ సాగర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్

- డీఏఆర్పీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దయాకర్

ఖిలా వరంగల్: విద్యార్థులు మానసిక స్థితితోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఏఆర్పీ వరంగల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.దయాకర్ సూచించారు. శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శారదాబాయి అధ్యక్షతన సృజనాత్మకత ఆలోచనలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు రోజువారీ జీవితంలో స్వయం పరిశీలన, సమస్యల పరిష్కారం, నిర్ణయాధికారం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, విమర్శనాత్మకమైన ఆలోచనలు, పరస్పర సంబంధాలు, భావోద్వేగ సమతుల్యత, ఒత్తిడిని తట్టుకునే నైపుణ్యం వంటి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరశురాములు, ఆడెపు రవీందర్, వెంకన్న, భిక్షపతి, ఉపేందర్, ఇంద్ర, రవీందర్‌బాబు, సత్యనారాయణ, రామస్వామి, రఫిక్ పాల్గొన్నారు.

కేయూలో దివ్యాంగులకు వీల్‌చైర్ల ఏర్పాటు



దివ్యాంగ విద్యార్థుల కోసం వీల్‌చైర్లను అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని దివ్యాంగ విద్యార్థుల సౌకర్యార్థం వీల్‌చైర్లు ఏర్పాటు చేసినట్లు కేయూ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ సౌజన్యంతో ఎనిమిది వీల్ చైర్లను కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం చేతుల మీదుగా వివిధ విభాగాలకు శనివారం అందించినట్లు ఆయన తెలిపారు. వీల్ చైర్లు కేయూలోని కేంద్ర గ్రంథాలయం, పరీక్షల విభాగం, మహిళా వసతి గృహం, పరిపాలన భవనం, హ్యూమానిటీస్ భవనం, యూనివర్సిటీ లా కళాశాలల్లో అందుబాటులో ఉంటాయని, వాటిని దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకోవాలని రాజు సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్, గ్రంథాలయ మెంబర్ ఇన్‌చార్జ్ సీజే.శ్రీలత, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా సుందర్‌రాజ్ యాదవ్‌ను గెలిపించాలి'

కేయూ క్యాంపస్: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికల బరిలో ఉన్న సుందర్‌రాజ్ యాదవ్‌ను గెలిపించాలని గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు కోరారు. కాకతీయ యూనివర్సిటీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటెలెక్చువల్ ఫోరం ద్వారా బీసీ వాదాన్ని భుజస్కంధాలపై వేసుకొని ఎన్నో ఏళ్లుగా బీసీల ఐక్యత, చైతన్యం కోసం సుందర్‌రాజ్ యాదవ్ కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. ఈమేరకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉపాధ్యాయులు సుందర్‌రాజ్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుమన్‌రాజ్, ఉపాధ్యక్షులు అజయ్‌సింగ్, రత్నం, సాయికుమార్, మురళి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో డెలివరీ ప్యాకేజీ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో మాతృదేవోభవ డెలివరీ ప్యాకేజీని ప్రారంభిస్తున్నట్లు గైనకాలజిస్ట్ డాక్టర్ అమతుల్ హఫ్సా తెలిపారు. ఈమేరకు ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో డెలివరీ ప్యాకేజీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమతుల్ హఫ్సా మాట్లాడుతూ మెడికవర్ అందిస్తున్న డెలివరీ ప్యాకేజీలో చేరిన వారికి 9నెలల పాటు ఉచిత గైనకాలజిస్ట్ కన్సల్టేషన్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. నార్మల్ డెలివరీకి రూ.25వేలు, సి – సెక్షన్‌కు రూ.35 వేల ప్యాకేజీని నిర్ణయించినట్లు వివరించారు. కార్యక్రమంలో మెడికవర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



నరేశ్ (ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఇప్పగూడెం–రఘునాథపల్లి రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జనగామ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. వరంగల్ కరీమబాద్‌కు చెందిన నూకల నరేశ్ (33) కొన్నాళ్లుగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన నరేశ్ గోవర్ధనగిరి సమీపంలో పట్టాలపై చేరుకొని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'కార్పొరేట్'కు దీటుగా విద్యాబోధన



ఉత్సవాలను ప్రారంభిస్తున్న మూగల కుమార్

హన్మకొండ: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తాము విద్యాబోధన అందిస్తున్నట్లు షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్ తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో షైన్ శతరంగి ఉత్సవాలను శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మూగల కుమార్ యాదవ్. జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఫౌండేషన్, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. నిపుణులైన ఉపాధ్యాయులతో అత్యుత్తమ బోధన అందించడం వలనే అద్భుత ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో షైన్ స్కూల్ కరెస్పాండెంట్ మూగల రమాయాదవ్, ప్రిన్సిపాల్ సబిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే కాలనీలో సమస్యల తిష్ట

- మెయిన్ రోడ్డు నుంచి స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో అపరిశుభ్రం
- పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లు
- పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు
- పట్టించుకోని రైల్వే అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు, వాహనదారులు





బాపూజీనగర్ నుంచి కడిపికొండ బ్రిడ్జి కింద నుంచి వెళ్లే మార్గంలో పెరిగిన పిచ్చిమొక్కలు



బ్రిడ్జి కింద పేరుకుపోయిన చెత్తాచెదారం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఈఎల్ఎస్ కాలనీలో నెలకొన్న సమస్యలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాపూజీనగర్ మెయిన్ రోడ్డు నుంచి కడిపికొండ బ్రిడ్జి మీదుగా రైల్వే కాలనీలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా మారింది. ఈ మార్గంలో పిచ్చి మొక్కలు, చెట్లు ఏపుగా పెరిగి రోడ్డు ఇరుకుగా మారింది. చెత్తాచెదారం పేరుకుపోయింది. దాంతో వాహనదారులు, పాదచారులు, రైల్వే క్వార్టర్స్ వాసులు, విధులకు వెళ్లే కార్మికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కడిపికొండ బ్రిడ్జి కింద చెత్త, వ్యర్థాలను ప్రజలు తీసుకొచ్చి పారేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దుర్వాసనతో కార్మికులు, స్థానిక రైల్వే క్వార్టర్స్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు గుంతలమయం

ఈ రోడ్డుపై అక్కడక్కడ గుంతలు పడ్డాయి. దాంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. రైల్వే అధికారులు స్పందించి రోడ్డు మార్గంలో పెరిగిన చెట్లను తొలగించి, కడిపికొండ బ్రిడ్జి కింద పేరుకుపోయిన చెత్తను తొలగించాలని పలువురు కోరుతున్నారు. బ్రిడ్జి కింద చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాల ప్రారంభోత్సవంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు

వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఈనెల 22నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి మహోత్సవాలను ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోనె జగదీశ్వర్ శనివారం ప్రారంభించారు. ఉదయం ధ్వజారోహణ, గణపతి పూజా, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, లింగతో భద్రమరకపారధన, అఖండ దీపారాధన, కలశ స్థాపన పూజా కార్యక్రమాలు చేపట్టారు. ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వడిచెర్ల సదానందం, గుండేటి కృష్ణమూర్తి, శ్రీరాముల పెద్దన్న దంపతులు, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, బయ్య స్వామి, దూపం సంపత్, సముద్రాల పరమేశ్వర్, డాక్టర్ మామిడి ఈశ్వరయ్య, బండారి భాస్కర్, మండల శ్రీరాములు, పాశికంటి రమేష్, ఓంకారేశ్వర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పింగిళి'లో ఉచిత నేత్ర వైద్యశిబిరం



విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగం హెల్త్ క్లబ్, శరత్ మ్యాక్సివిజన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుహాసిని మాట్లాడుతూ తరచుగా కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ సుభాషిణి, అధ్యాపకులు సురేష్‌బాబు, అరుణ, లకన్‌సింగ్, మహేష్ పాల్గొన్నారు.